ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ. 18.03.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. మూసీ నది ప్రక్షాళన కేవలం అందం కోసం కాదని, పేదల జీవితాల్లో వెలుగులు నింపే ఒక మహా యజ్ఞమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసస సభలో స్పష్టం చేశారు.
2. మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని శాసన మండలిలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
3. క్రిటికల్స్ మినరల్స్ గురించి విదేశాలపై ఆధారపడకుండా కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని అందులో భాగంగానే నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ను ప్రారంభించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి లోక్ సభలో చెప్పారు.
4. 18 నెలలు పడుతుందన్న మూసీ పునరుజ్జీవ డీపీఆర్, రెండు నెలల్లోనే ఎలా పూర్తయ్యిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. తారాక రామారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

---------------------------

**బడ్జెట్ సమావేశాలు**

రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు మూడో రోజు కొనసాగుతున్నాయి. శాసనసభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ అంశాలపై సభ్యులు అడిగే ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు ఇస్తున్నారు. ప్రశ్నోత్తరాలలో భాగంగా వైద్యారోగ్య రంగంపై సభ్యులు డాక్టర్ సంజయ్, మధుసూదన్ రెడ్డిలు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ సంఖ్య భారీగా పెరిగిందని, దానికి అనుగుణంగా డాక్టర్లు, ప్రొఫెసర్ల నియామకం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ఆసుపత్రుల్లో వెంటిలేటర్లు,

ఆధునిక పరికరాల కొరతను వారు సభ దృష్టికి తీసుకెళ్లారు. వీరి ప్రశ్నలకు వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమాధానం ఇచ్చారు. ఆసుపత్రుల విజయవంతానికి డాక్టర్లతో పాటు ఆధునిక సాంకేతికత అంతే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. IPHS ప్రమాణాల ప్రకారం రాష్ట్రంలోని అన్ని ఆసుపత్రుల్లో వైద్య పరికరాల ప్రామాణీకరణ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో బెడ్ల సంఖ్యను బట్టి బడ్జెట్ కేటాయింపులు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.. నిజామాబాద్, సిద్దిపేట వంటి ప్రాంతాల్లో అత్యాధునిక 3 టెస్లా MRI, 128 స్లైస్ CT మిషన్లను ఏర్పాటు చేస్తున్నామని.. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి 35-40 కిలో మీటర్లకు ఒకటి చొప్పున 107 లెవల్-3 ట్రామా కేర్ సెంటర్లను నిర్మిస్తున్నట్లు మంత్రి వివరించారు.

**పిటిసి, హైదరాబాద్**

-------------------------------

**కేటీఆర్**

తెలంగాణ శాసనసభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా మూసీ పునర్జీవం ప్రాజెక్టు పై చర్చ సందర్భంగా కేటీఆర్ ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. మూసీ డీపీఆర్ పేరుతో ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోంది అంటూ వ్యాఖ్యలు చేశారు. జనవరిలో 18 నెలలు పడుతుందన్న డీపీఆర్, రెండు నెలల్లోనే ఎలా పూర్తయ్యిందని ప్రశ్నించారు. అంతేకాకుండా, పాకిస్థాన్‌లో రెడ్ కార్నర్ నోటీసులు ఎదుర్కొంటున్న సంస్థకు ఈ కాంట్రాక్ట్ ఎలా ఇస్తారని నిలదీశారు. 10 వేల ఇళ్లు కూలిపోతాయని గెజిట్ చెబుతుంటే, మంత్రి కేవలం 1400 అని అబద్ధాలు ఆడుతున్నారని ఆరోపించారు.

**బైట్ – కేటీఆర్**

దీనిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు తమ ప్రభుత్వంలో కొత్తగా బఫర్ జోన్ నిర్ణయించలేదు అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే ముందుకు వెళ్తున్నాం అని స్పష్టం చేశారు. తొలి దశ ప్రాజెక్టు అంచనా వ్యయం 7 వేల కోట్ల రూపాయలుగా ప్రకటించిన మంత్రి, 2026 ఫిబ్రవరిలోనే డీపీఆర్ పూర్తయిందని వెల్లడించారు. నిర్వాసితులకు 2013 చట్టం ప్రకారం

పరిహారం, టీడీఆర్ ఇస్తామని భరోసా ఇచ్చారు. మురికి కూపంగా మారిన మూసీని అభివృద్ధి చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారు? అంటూ ప్రతిపక్షాన్ని ప్రశ్నించారు.

**పిటిసి, హైదరాబాద్**

-----------------------------

**భట్టి విక్రమార్క**

మూసి పునర్జీవంపై చర్చ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ... మూసీ నది ప్రక్షాళన కేవలం అందం కోసం కాదని, అది పేదల జీవితాల్లో వెలుగులు నింపే ఒక మహా యజ్ఞమని శాసనసభలో స్పష్టం చేశారు. దశాబ్దాలుగా మురుగు కూపంలో, అపరిశుభ్ర వాతావరణంలో మగ్గుతున్న వేలాది కుటుంబాల జీవన స్థితిగతులను మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఇళ్లు కోల్పోయే ప్రతి పేద కుటుంబానికి, వారికి పట్టా ఉన్నా లేకపోయినా, అదే ప్రాంతంలో అత్యాధునిక అపార్ట్ మెంట్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం గంటాపథంగా చెప్పింది అని గుర్తు చేశారు. నివాసాలే కాకుండా, అక్కడి మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆర్థికంగా బలోపేతం చేస్తామని, వారి పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. బాపు ఘాట్ నుండి ఉస్మాన్ సాగర్ వరకు మూసీని మణిహారంగా మారుస్తూ, నదిలోకి వచ్చే ప్రతి నాలా వద్ద ఎస్టీపీలను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన నీటిని ప్రవహింపజేస్తామని ఈ సందర్భంగా బట్టి విక్రమార్క ప్రకటించారు.

**బైట్ - భట్టి విక్రమార్క**

**పిటిసి, హైదరాబాద్**

------------------------

**బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్**

తెలంగాణ శాసనసభలో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై జరిగిన చర్చలో ప్రభుత్వం అందిస్తున్న గణాంకాలు అవాస్తవమని, ప్రాజెక్టు ముసుగులో పేదల ఇళ్లను కూల్చేందుకు

కుట్ర జరుగుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభను బహిష్కరించారు. మంత్రి శ్రీధర్ బాబు డీపీఆర్ వివరాలను వెల్లడిస్తున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ స్పీకర్ పోడియం వద్ద నిరసన తెలిపారు. తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శిస్తూ వారు వాకౌట్ చేశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ... కేవలం రెండు నెలల్లో డీపీఆర్ ఎలా సిద్ధమవుతుందని ప్రశ్నించారు.

**పీటీసీ - హైదరాబాద్**

-----------------------------

**కిషన్ రెడ్డి**

క్రిటికల్స్ మినరల్స్ గురించి విదేశాలపై ఆధారపడకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఇందులో భాగంగానే నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్ ను ప్రారంభించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి లోక్ సభలో చెప్పారు. ప్రస్తుతం 90 నుంచి 95 శాతం క్రిటికల్ మినరల్స్ ను దిగుమతులపైనే ఆధారపడుతున్నామని భవిష్యత్ లో ఆ పరిస్థితి తగ్గుతుందన్నారు. విదేశాల్లోని క్రిటిక్ల్ మినరల్ బ్లాక్స్ ను గవర్నమెంట్ టు గవర్నమెంట్ స్థాయిలో ఒప్పందాలు చేసుకుని మన దేశానికి తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయన్నారు. ఇప్పటికే అర్జెంటినాతో లిథియం మైనింగ్ కు సంబంధించిన ఒప్పందం పూర్తయిందని త్వరలో బ్రెజిల్, చీలి వంటి దేశాలతోను ఒప్పందాలు చేసుకోబోతున్నామన్నారు.

**డెస్క్**

--------------------------

**పొన్నం ప్రభాకర్**

తెలంగాణలో మహిళలను వ్యాపారవేత్తలుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది అని శాసన మండలిలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసన

మండలిలో జరిగిన చర్చలో భాగంగా ఆర్టీసీ పురోగతి, మహిళా సంక్షేమంపై పొన్నం ప్రభాకర్ వివరాలను వెల్లడించారు. రాష్ట్రంలో 600 బస్సులకు మహిళలనే యజమానులను చేసినట్లు ప్రకటించారు. మహిళా యజమానులు అన్ని ఖర్చులు పోను నెలకు 70 వేల రూపాయల నికర ఆదాయం గడిస్తున్నారని మంత్రి వెల్లడించారు. అలాగే బస్ స్టేషన్లలో మౌలిక వసతుల కోసం 100 కోట్ల రూపాయలు కేటాయించామని, ఏటూరునాగారం, పెద్దపల్లిలో కొత్త డిపోలు ఏర్పాటు చేశామని తెలిపారు.

**పీటీసీ - హైదరాబాద్**

------------------------------

**బీఆర్ఎస్ నిరసన**

అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు ఈరోజు గన్ పార్క్ వద్ద మొక్కజొన్న రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన చేపట్టారు. చేతిలో మొక్కజొన్న కంకులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో రైతులు క్వింటాల్‌కు కేవలం 1600 రూపాయల నుండి 1700 కే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. రైతులకు మద్దతు ధర దక్కే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

**పీటీసీ – హైదరాబాద్**

-------------------------

**ఆయిల్ పామ్**

ఆయిల్ పామ్ పంట సాగుకు రైతులు ముందుకు రావాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ పిలుపునిచ్చారు. ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఆద్వర్యంలో నిర్వహించిన ఆయిల్ పామ్ మొక్కల మెగా ప్లాంటేషన్ కార్యక్రమానికి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..

**బైట్ – కలెక్టర్ గరిమా**

**పీటీసీ – రాజన్న సిరిసిల్ల**

-----------------------------

**అమృత్ మిత్ర కు అరుదైన గౌరవం**

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఢిల్లీలో నిర్వహించిన అమృత్ మిత్ర మహోత్సవంలో పాల్గొనే అవకాశం కరీంనగర్ నగరపాలక సంస్థ జ్యోతినగర్ వాటర్ ట్యాంక్ వద్ద పనిచేస్తున్న మహిళా సంఘం సభ్యురాలు దయ్యాలా హరితకు దక్కింది. కేంద్ర ప్రభుత్వం తనకు అమృత్ మహోత్సవంలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు చాల సంతోషంగా ఉందని ఆకాశవాణితో మాట్లాడుతూ తెలిపారు.

**బైట్ ... దయ్యాల హరిత**

**పిటిసి, కరీంనగర్**

----------------------------

**ఆర్ఎస్ఎస్**

ప్రతి ఏడాది తన వార్షిక కార్యకలాపాలను సమీక్షించుకునే ప్రతినిధుల సభ ఈసారి హర్యాణా లోని పానిపట్ వేదికగా జరిగిందని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాశం రమేష్ వెల్లడించారు. ఈవాళ హైదరాబాద్ లోని కేశవ నిలయంలో జరిగిన పత్రికా సమావేశంలో కాశం రమేష్ మాట్లాడుతూ... నాగ్‌పూర్‌లో ఆవిర్భవించిన సంఘం నేడు దేశ వ్యాప్తంగా లక్షకు పైగా శాఖలకు విస్తరించిందని, తెలంగాణలో 80 శాతం మండలాలు, 83 శాతం పట్టణ ప్రాంతాలకు చేరుకుందని ఆయన పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ గత ఏడాదిలో 5 వేలకు పైగా కొత్త శాఖలను ప్రారంభించిందని తెలిపారు. రాబోయే కాలంలో పంచపరివర్తన ద్వారా ప్రతి ఇంటిని చేరుకుంటామని తెలిపారు. ఈనెల 20 నుంచి తెలంగాణలో నిర్వహించనున్న భారీ హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంత్ రవిదాస్ జన్మ దినోత్సవాలను కూడా ఘణంగా జరుపుకుంటామని అన్నారు. అలాగే ఆర్ఎస్ఎస్ పై అమెరికా సంస్థ విడుదల

చేసిన నివేదిక, కాంగ్రెస్ వ్యాఖ్యలపై స్పందిస్తూ... దేశభక్తికి ప్రతీక అయిన ఆర్ఎస్ఎస్ ను అడ్డుకోవడం అసాధ్యమని, వందేమాతరం అనేది కేవలం నినాదం కాదు అది దేశ ఆత్మ అని స్పష్టం చేశారు.

**ఎం.ఎస్.వి**

---------------------------

**మంచిర్యాల వర్షాలు**

అకాల వర్ష ప్రభావంతో మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని కేకే ఫైవ్ గనిలో విద్యుత్ కు అంతరాయం కలగడంతో మొదటి షిఫ్ట్ లో ఉత్పత్తి నిలిచిపోయింది , అధికారులు వెంటనే స్పందించి భూగర్భ గనిలో ఉన్న కార్మికుల అందరిని సురక్షితంగా గని పైకి తరలించినప్పటికీ, ఒక కార్మికునికి సరైన ఆక్సిజన్ అందక అస్వస్థకు గురికావడంతో సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**పీటీసీ - మంచిర్యాల**

--------------------------------